కథ

# అమృత వర్షిణి

**కాకర్లమూడి జ్యోతిమోహన్**

**"కంగ్రాచ్యులేషన్స్, మీకు కవలలు పుట్టారు. ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు. మగపిల్లలు" నర్సు చెప్పగానే ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు సాంబశివరావు. భార్య కుసుమానికి ఇది మూడో కానుపు. మొదట ఇద్దరూ ఆడపిల్లలు, పద్మ, గౌరి. రెండుసార్లు చులాగ్గా తిరిగి ఇంట్లోనే పురుడుపోసుకున్న కుసుమం ఈసారి మొదటి నుంచీ నలతగానే ఉంది.**

ఏడో నెలలోనే మంత్రసాని హెచ్చరించింది. ''బాబూ! కవలలేమో, పట్నం తీసుకెళ్లి చూపించు'' అంటూ అదిగో ఇదిగో అని తాత్సారం చేస్తూ తొమ్మిదో నెలలో తీసుకొచ్చి చూపించగానే డాక్టరమ్మ చీవాట్లు పెట్టి వెంటనే ఆపరేషన్ చేసి బిడ్డలను తీయాలంది. పంచాయతీ రాజ్‌లో గుమాస్తా అయిన సాంబశివరావు మళ్లీ ఆడపిల్లలేమో అని హడలిపోయాడు. మగపిల్లలనగానే కొంత ఊరట చెందినా భార్య పరిస్థితి ఎలా ఉందో అని ఆందోళన చెందాడు. తోడుగా ఉన్న పక్కింటి పెద్దమనిషిని తన ఇంట్లో శుభవార్త చెప్పమని పంపించాడు. డెబ్బై ఏళ్లు పైబడ్డ అతని తల్లి ఇద్దరు పిల్లలని, పక్షవాతంతో తీసుకుంటున్న తండ్రిని చూస్తూ ఇంట్లోనే ఉంది. ఇంకో గంటకి 'గండం తప్పింది' అంటూ కుసుమాన్ని కవలలని ఆపరేషన్ థియేటర్ నుంచి తీసుకువచ్చారు. వంశోద్ధారకులని చూసి పొంగిపోయాడు అతను. ఇద్దరిలో ఒకడు కొంచెం బలహీనంగా, బరువు తక్కువగా ఉన్నా, తెల్లాగా ఉన్నాడు. ఇంకొకడు చామనఛాయతో హుషారుగా ఉన్నాడు.

★ ★ ★

''కుసుమం! మీ అక్క లలితాంబ, బావగారు వస్తున్నారట నిన్ను, పిల్లలను చూడడానికి. పక్కింటాయనకి పట్నంలో కనిపించి చెప్పారట'' అన్నాడు సాంబశివరావు.

''ఎందుకూ?'' మొహం చిట్లించింది కుసుమం. హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చినా, ఆమె పూర్తిగా తేరుకోలేదు ఇంకా. కుసుమానికి పాలు పడలేదు. పాల డబ్బాల ఖర్చు, హాస్పిటల్ బిల్లు తడిపి మోపెడయ్యాయి. ఈ పరిస్థితుల్లో ఇరుగూ పొరుగూ వచ్చి పలకరించినా విసుగ్గా ఉంటోంది ఆమెకు. లలితాంబ ఆమె పెదనాన్న కూతురు. కుసుమం తండ్రి పేకాట పిచ్చిలో పడి ఆస్తి పోగొట్టుకుంటే, పెత్తండ్రి తమ్ముడితో దెబ్బలాడి మరదలిని, కుసుమాన్ని తన ఇంట్లో పెట్టుకున్నాడు. ఆమె పెళ్లి కూడా ఆయన చేతుల మీదుగానే జరిగింది. లలితాంబ అందగత్తె. కొంచెం అతిశయం కూడా ఎక్కువే. ఆస్తిపరుల కోడలయింది గానీ కడుపు మాత్రం పండలేదు. పెళ్లిళ్లయ్యాక లలితాంబకి, కుసుమానికి సహజంగానే దూరం పెరిగినా ఒకరి కబుర్లు ఒకరికి తెలుస్తూనే ఉన్నాయి. వచ్చిన వారికి భోజన మర్యాదల మాటెలా ఉన్నా కూర్చోబెట్టడానికి సరైన కుర్చీలే లేవు తమ ఇంట. ఆ మాటే అంది భర్తతో ''పిచ్చిదానా! ఆవిడ కంటే ఎంత ధనవంతురాలవో నీకేం తెలుసు?'' పిల్లలని చూపిస్తూ అన్నాడతను.

అదే నిజమయింది! వస్తూనే లలితాంబ, గోవర్ధనం ముందు గదిలో చాప మీద పాతచీర పరచి పడుకోబెట్టిన కవలల దగ్గర కూలబడ్డారు. నీరసంగా ఉన్న కుసుమాన్ని కౌగిలించుకుని ''ఎంత దృష్టవంతురాలివి కుసుమం!'' మనస్ఫూర్తిగా అంది లలితాంబ. గోవర్ధనం భేషజాల్లేని మనిషి. సాంబశివరావు తండ్రిని ఆదరంగా పలకరించాడు. లలితాంబ పెద్దావిడకి వంటలో సాయం చేసింది. పచ్చగా, నాజుగ్గా ఉన్న పద్మ, గౌరిలకు జడలు వేసి పూలు పెట్టింది. సాంబశివరావు ఆఫీసు నుంచి తొందరగా వచ్చాడు. అంతా కలిసి భోంచేశారు.

''కుసుమం, పిల్లలకేం పేర్లు పెడతావు?'' తమలపాకులు ఈనెలు తీస్తూ ప్రశ్నించింది లలితాంబ.

''ఏమో! అంతవరకు ఎక్కడ ఆలోచించాము? నేను అసలు వీళ్లని చూస్తానా అనుకున్నాను'' దుఃఖంతో గొంతు పూడుకుపోయింది కుసుమానికి.

''ఛ! అవేం మాటలు! పోనీ వీడిని మాకిచ్చేస్తావేమిటి?'' హుషారుగా ఆడుకుంటున్న పిల్లవాడిని ఒళ్లోకి తీసుకుంటూ అంది.

''నీకు కాస్త ఓపిక వచ్చాక ఇచ్చేస్తా! ఎలాగా డబ్బా పాలే!'' ఒక్క క్షణం నిశ్శబ్దం ఆవరించింది అక్కడ.

''లలితా! ఏమిటా మాటలు?'' గోవర్ధనం మందలింపుగా అన్నాడు.

''తప్పేం ఉందండీ? మేమున్నా, కుసుమాన్ని పెంచాడు మా నాన్న. నేనెవరూ లేక..'' ఈసారి లలితాంబ గొంతు పూడుకుంది. ఏమి జరగబోతోందో తెలిసినట్టుగా మంచాల మీద ఒరిగిన పెద్దవాళ్లిద్దరూ పొడిగా దగ్గి అటూ ఇటూ కదిలారు. ''అలా బయటకి వెళ్లొద్దాం'' అంటూ గోవర్ధనం, సాంబశివరావు బయటికి కదిలారు.

బయట గోవర్ధనం చెప్పిన మాటలు సాంబశివరావు మనసులో స్థిరంగా నాటుకున్నాయి. వాటి సారాంశం లలితాంబకి పిల్లలు పుట్టే యోగం లేదు. కొండంత ఆస్తి. బంధువుల పిల్లవాడిని పెంచుకోవాలని ఉంది ఇద్దరికీ. ఎవరో ఒకరు ఇవ్వకపోరు కానీ, లలితాంబకి కుసుమం అంటే అభిమానం. వారి పిల్ల వాడంటే ఎవరికీ ఎబ్బెట్టుగా ఉండదు. తొందరేం లేదు. నెమ్మదిగా చెప్పవచ్చు. ''పెద్దవాళ్లని అడిగీ...'' సాంబశివరావు నసిగాడు.


మర్నాటికి ఆలోచనలతో కుసుమానికి ఫెళ్లున జ్వరం, కవలలని, కుసుమాన్ని తీసుకుని ''పట్నంలో డాక్టరుకి చూపిస్తాం'' అంటూ తమ కారులో బయల్దేరారు గోవర్ధనం దంపతులు. వారం తర్వాత కొంచెం తేరుకున్న కుసుమాన్ని, ఒక పిల్లవాడిని దింపి వెళ్లారు. మూడు నెలల తర్వాత ఘనంగా 'దత్తత స్వీకారం' జరిగింది. అప్పుడే పిల్లలిద్దరికీ నామకరణం చేశారు. కొంచెం ఛాయ తక్కువగా ఉన్న లలితాంబ దత్తపుత్రుడికి గోవర్ధనం తండ్రి పేరు 'హరిప్రసాద్' అనీ, రెండవ వాడికి సాంబశివరావు తండ్రి పేరు కలిసేలా 'గిరీష్' అని పేర్లు పెట్టారు.

హరి, గిరి రెండిళ్లకీ వెలుగు, వెన్నెల తెచ్చారు. గిరి ఇద్దరక్కలు, తాత, బామ్మ, తల్లిదండ్రుల ప్రేమాభిమానాలనే ఆస్తికి వారసుడయితే, హరి లలితాంబ, గోవర్ధనం గార్ల ఆశలకి ప్రతిరూపంలా పెరుగుతూ వారి కోట్ల ఆస్తికి ఏకైక వారసుడయ్యాడు. కానీ లేని దాని కోసం పరుగులు పెట్టడం, అందని వాటి కోసం అర్రులు చాచడం మానవనైజం. చుట్టుపక్కల ఉన్నవారి మాటల ప్రభావం, బంధువుల విసుర్లు, వ్యాఖ్యానాల వల్ల అల్లారుముద్దుగా పెరుగుతున్న హరి మనసులో ఏదో తెలియని వెలితి, వేదన, అసంతృప్తి పెరిగాయి. గిరికి వాళ్లింట్లో జరిగే అపురూపానికి అసూయపడేవాడు 'తమ్ము' 'తమ్ము' అంటూ గారం చేసే అక్కలు 'అర్భకుడమ్మా' అంటూ

దిష్టి తీసే బామ్మ, గిరికి మాత్రమే నెయ్యి వడ్డించే కుసుమం, పిల్లవాడికి పెరుగు వెయ్యి అంటూ మజ్జిగ నీళ్లు పోసుకునే సాంశివరావు... వీరంతా గిరి చుట్టూ తమ ప్రేమాభిమానాలనే కోట కట్టి వాడిని కాపాడుతున్నట్టుగా తోచేది హరికి. గోవర్ధనం హరికి జాగ్రత్తగా ఉండడం, బాధ్యతగా ప్రవర్తించడం నేర్పడానికి తాపత్రయపడేవాడు. అసూయాపరులైన బంధువుల కళ్లల్లో పడకూడదని లలితాంబ కూడా పిల్లవాడిని ఎక్కడికీ పంపేది కాదు. నలుగురూ చూస్తుండగా తను పిల్లవాడిని ముద్దుచేయడానికి కూడా భయపడేది. దత్తత తీసుకునేటప్పటికీ వయసు ముదిరిన వారు హరి టీనేజీకి వచ్చేటప్పటికి మరింత పెద్దగా అయ్యారు. హరికి ఆస్తి అప్పజెప్పి కృష్ణారామా అనుకోవాలి అనే తాపత్రయం ఎక్కువగా ఉండేది వారిలో. ఈ వాతావరణంలో అసంతృప్తిగా పెరుగుతున్న హరి మనసుతో ''నువ్వు రంగు తక్కువని పెంపకానికిచ్చారోయ్! అయినా అదృష్టవంతుడివి! తంతే నోట్లగంపలో పడ్డావు'' అని వేళాకోళమాడాననుకొని ఓ బంధువు విషబీజం నాటాడు.

అయితే హరి జన్మసంస్కారం కలవాడు. ఎక్కడా దారి తప్పలేదు. డబ్బు దుబారా చేయలేదు. చెడు సావాసాలు మరగలేదు. డిగ్రీ పూర్తవ్వకుండానే ఆస్తి వ్యవహారాలు చక్కబెట్టడం మొదలుపెట్టాడు. ఉన్నవి కాక కొత్త వ్యాపారాలూ ప్రారంభించాడు. తండ్రికి చేదోడు వాదోడయ్యాడు. గోవర్ధనంగారు కూడా సాంబశివరావు కుటుంబానికి ఆసరాగా ఉండే వారు. అతని తల్లిదండ్రులు పోయినపుడు, పద్మ, గౌరిల పెళ్లిళ్ల సమయంలోనూ కొండంత అండ అయ్యాడు. అన్ని సందర్భాలలోను పెద్దవారు ఉద్యోగానికి లోనై కంట తడిపెట్టినపుడల్లా హరి మనసు భగ్గుమంటుండేది. ''దీని కోసమే నన్ను దూరం చేశారు. వారి స్వార్థం కోసం నన్ను పంపకానికిచ్చారు'' అని మనసులోనే ఆక్రోశించేవాడు.

గిరి అమాయకుడు. మితభాషి. అతని చదువు పూర్తయ్యాక ఒక ఆయిల్ కంపెనీలో ఉద్యోగం రావడానికి కూడా గోవర్ధనం గారి పలుకుబడి ఉపయోగపడింది. వారి స్వభావాలకు విరుద్ధంగా చలాకీగా ఉండే సీతతో గిరికీ, శాంతంగా, నెమ్మదిగా ఉండే రూపతో హరికీ వివాహాలయ్యాయి. వారి కుటుంబాల మధ్య అనుబంధం మరింత గాఢమయింది.



★ ★ ★

''నాన్నా! నాకు దుబాయి వెళ్లే అవకాశం వచ్చింది వెళ్లనా'' ఆశగా అడిగాడు గిరి తండ్రి వంక చూస్తూ!

''మంచిది నాయనా, మరి మాకు సదుపాయంగా ఉంటుందో లేదో అక్కడ!'' అన్నాడు సాంబశివరావు. ''ముందు నేను వెళ్లి అన్నీ చూసుకురావాలి. కొన్నాళ్లు పోయాక ఫేమిలీని తీసుకువెళ్లవచ్చు. అయినా అందరమూ వెళ్తే ఆ దేశంలో ఖర్చులు భరించలేము నాన్నా'' అన్నాడు గిరి.

''మరి కోడలూ, పిల్లలూ...''

''వాళ్లనీ వీలుచూసుకుని తీసుకువెళతాను నాన్నా! ముందు నేను వెళ్లి సెటిలయ్యాక అప్పుడు ఆలోచిద్దాం!'' అన్నాడు గిరి.

అనుకున్నట్టుగా గిరి ప్రయాణమై వెళ్లాక సీత పాట్లు మొదలయ్యాయి. ఇద్దరు చిన్న పిల్లల్నీ అత్తమామల్నీ ఒక్కత్తీ చూసుకోవడం కష్టంగా ఉండేది. ఒకటి రెండుసార్లు రూపతో తన కష్టాలు ఏకరువు పెట్టుకుంది. అప్పటికీ గోవర్ధనం గారి ఆరోగ్యం అంతంతమాత్రంగానే ఉంది. భర్త మనస్తత్వం తెలిసున్న ఆమె నిస్సహాయంగా సీత చెప్పింది వినేది. సీత అత్తగారిని, మామగారిని తీసుకుని గోవర్ధనంగారిని చూడడానికి వస్తూ ఉండేది. తండ్రి దగ్గరే ఉండి సేవలు చేసే హరి వీరు రాగానే పక్కకి తప్పుకునే వాడు. కుసుమ మాత్రం అతడిని

కళ్లనిండా చూసుకుని ఏదో ఒకటి పలకరించడానికి ప్రయత్నించేది. హరి ముక్తసరిగా సమాధానం చెప్పి వెళ్లిపోయేవాడు.

ఓ రోజు రూప మందలింపుగా అంది. ''ఆవిడ అలా పలకరిస్తుంటే విదిలించుకున్నట్టుగా వెళ్లిపోతారేం?''

దానికి హరి కఠినంగా ''ఏం? ఇప్పుడు కావల్సి వచ్చానా? అదంతా నా మీద ప్రేమ కాదు. వాళ్లు గిరిని మిస్సవుతున్నారు. అందుకే నాన్నని చూసే వంకతో ఈ రాకపోకలు. వాళ్లని చూసినప్పుడల్లా నాన్న కూడా ఎమోషనల్ అయిపోతున్నారు. నాకు అది నచ్చడం లేదు'' అన్నాడు. రూప ఏదో చెప్పబోయింది. ''రూపా! ఈ విషయంలో నువ్వేం చెప్పకు. నీకు నా గుండె మంట తెలియదు. నీకే కాదు. ఎవరికీ అర్థం కాదు. నన్నిలా వదిలెయ్!'' అనేశాడు హరి.

అందరినీ దుఃఖంలో ముంచి గోవర్ధనంగారు కన్ను మూశారు. గిరికి రావడం వీలుపడలేదు. ఫోనులోనే వెక్కివెక్కి ఏడిచాడు. ఆఖరికి లలితాంబే అతడిని ఓదార్చవలసి వచ్చింది. పద్మ, గౌరి కుటుంబాలతో సహా వచ్చివాలారు. వారిద్దరికీ హరితో చనువు తక్కువే అయినా ఈ సమయంలో అతడికి అండగా ఉండాలనుకున్నారు. ఇదంతా హరికి భరించలేనట్టుగా ఉంది. అతడి ముభావాన్నీ, చిరాకునీ చూసి ''బాధతో ఉన్నాడు పాపం!'' అని అందరూ జాలి పడ్డారు. ''అయ్యో! గిరి దగ్గరే లేడా!'' అని ఎవరైనా అంటే పుండుమీద కారం చల్లినట్టుగా ఉంది అతనికి. కర్మకాండ ముగిసి అంతా వెళ్లిపోయాక తల్లి దగ్గర కూర్చున్నాడు హరి. ''ఒంటివాళ్లం అయిపోయాం అమ్మా!'' అని ఆమె ఒళ్లో తలపెట్టుకుని భోరుమన్నాడు. లలితాంబ కళ్లు తుడుచుకుంది.

''బాధ పడకు నాయనా! నువ్వు ధైర్యంగా ఉండాలి. ముందో వెనకో అంతానూ, నీకు తోబుట్టువులున్నారు. ఒంటరివెలా అవుతావు? వారి సాయంతో నన్ను కూడా సాగనంపాలి'' ఓదార్చింది.

చివ్వున తలెత్తాడు హరి! ''అమ్మా! నీకూ, నాన్నకూ నేనొక్కడినే. వాళ్లంతా నా తోబుట్టువులైతే నేను నీ కొడుకునెలా అవుతాను? దత్తత మంత్రాలకి అర్థం తెలుసా అమ్మా? నేను వారి సంతానంగా మరణించి, నీ కొడుకుగా పుట్టాను. నాన్న బాధపడతారని వాళ్లని రానిచ్చాను గానీ...'' దుఃఖంతో, కోపంతో రొప్పుతున్నాడు హరి. లలితాంబ తెల్లబోయి చూస్తోంది. రూప చటుక్కున మంచినీళ్లందించింది భర్తకి. ''బాధపడకండి. కంట్రోల్ చేసుకోండి'' అంటూ కళ్లతోటే హెచ్చరించింది అతనిని అలా మాట్లాడవద్దంటూ.

ఈ హడావిడికి గుమ్మంలోకి వచ్చి నించున్నాను. పిల్లలిద్దరూ బిక్కమొఖాలతో! ''పాపా, బాబూ రండి! మీ డాడీని ఊరుకోబెట్టండి. పాపం! తాతగారు దేవుడి దగ్గరికి వెళ్లారని బాధపడుతున్నారు'' అంటూ పిల్లలని పిలిచింది రూప. తనని చుట్టుకుపోయిన పిల్లలని చూసి కొంత తేరుకున్నాడు హరి.

★ ★ ★

దుబాయ్ నుంచి గిరి ఫోన్ చేశాడు. తరచూ జ్వరం వస్తోందని, ఒకసారి పిల్లలను చూడాలని ఉందని. తనకి రావడానికి లీవు దొరకదని, సీత, పిల్లలు వస్తే బాగుంటుందని. తల్లినీ, తండ్రిని అడిగి చెప్తే టిక్కెట్లు ఏర్పాటు చేస్తానని చెప్పాడు. పచ్చివెలక్కాయ గొంతులో పడ్డట్టయింది సీతకి. హరి ముభావం, రూప నిస్సహాయత ఆమెకి అర్థం అయ్యాయి. ముఖ్యంగా గోవర్ధనం గారు పోయాక హరి ప్రవర్తన చూస్తే సమస్య తాత్కాలికమైనదిగా అనిపించలేదు ఆమెకి. తనే అడగచ్చుగా అని మనసులోనే భర్తని విసుక్కుంది. విషయం చూచాయగా తెలియగానే సాంబశివరావు ''వెళ్లి రండమ్మా! మేము ఉండగలం, అంతగా ఇబ్బందయితే హరి దగ్గర నాలుగు రోజులుంటాము'' అన్నాడు.

''అవును, అక్కకి తోడుగా ఉన్నట్టుట్టుంది'' వంతపాడింది కుసుమం.


గిరికి ప్రయాణం ఏర్పాట్లు చేయమని చెప్పి రూప దగ్గరకి బయల్దేరింది. లలితాంబని పలకరించి చెప్పింది. ఆవిడ ఎదురుగా ఏమీ అనకపోయినా, తర్వాత రూప చెప్పింది. ''ఆయన ప్రవర్తన ఏమీ బాగుండడం లేదు సీతా! తాను ఒంటరిననీ, అందరూ వాళ్లవాళ్ల స్వార్థానికి వాడుకున్నారనీ తరచూ బాధపడుతున్నారు. ఇది మొదటి నుంచీ ఉండి ఇప్పుడు బయటపడుతోందో లేక మావగారు పోయాక డిప్రెషన్‌లో నుంచి వచ్చిందో!''

''బాధపడకు రూపా! వీలు చూసుకుని ఏదైనా మంచి డాక్టరు దగ్గరకి తీసుకెళ్లు. ఈ పరిస్థితుల్లో నీకు తోడుగా ఉండవలసింది పోయి మా వాళ్ల భారం కూడా నీమీద పెట్టవలసి వస్తోంది'' అంది సీత.

''అదేం లేదు సీతా! ఆయన ఆలోచనలు ఇలా ఉన్నాయి అని మీకెవరికయినా చెప్పాలనిపించింది. ఎప్పుడయినా ఆయన మనసు బయటపడితే దెబ్బతగి

## స్టయిల్... స్టైల్

**లారెన్స్ కొత్త చిత్రం 'స్టయిల్' గురించే అంతా చర్చించుకుంటున్నారు. పొలిటికల్ రౌడీలో హీరోయిన్‌గా చేసి అందాలారబోసిన ఛార్మి, మీనాక్షి హీరోయిన్ కమలినీముఖర్జీ నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయియింది. 'ఎవడిగోలవాడిదే' చిత్రాన్ని నిర్మించిన లగడపాటి శ్రీధర్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. మణిశర్మ సంగీతాన్ని సమకూర్చిన ఈ చిత్రంలో అన్ని వర్గాలకి నచ్చే అంశాలున్నాయంటున్నారు. చూద్దాం ఈ చిత్రం ఏమేరకు సక్సెస్‌ని సాధిస్తుందో?**



లేవారిని ఓదార్చడానికయినా ఒకరికి ఈ విషయం తెలియాలి'' దృఢంగా అంది రూప.

''ఛ ఛ! అనవసరంగా ఏదో ఊహించుకుంటున్నావు. రక్తసంబంధం చాలా గొప్పది. వాళ్లంతా ఒక్కటే. నువ్వూ, నేనే పరాయి వాళ్లమోయ్!'' హాస్యంగా అంది.

## కానుక

**సంక్రాంతి పండగంటే అందరికీ సంతోషమే. ఆ పండగనాడు ఇల్లంతా సందడే సందడి. ఇప్పుడు వెంకటేష్ అభిమానులకి ఇది నిజంగా పండుగరోజే. పండగనాడు 'లక్ష్మి'చిత్రం విడుదల కాబోతోంది. పండగ సెంటిమెంట్‌తో విడుదల చేస్తున్న ఈ చిత్రం వెంకటేష్‌కి కలిసి వస్తుందేమో చూడాలి మరి. ఇప్పటికే ఆడియో విడుదలై మంచి హిట్ కావడంతో అదే ఊపుతో ఈ చిత్రం కూడా విడుదలై మంచి హిట్ అవుతుందని వెంకీ ఆశాభావంతో ఉన్నాడు. వివి.వినాయక్ దర్శకత్వం వహించిన ఈచిత్రానికి రమణ గోగుల శ్రావ్యమైన సంగీతాన్ని సమకూర్చారు.**

''అలాగా!'' అంటూ ఆమె తల మీద చిన్నగా మొట్టి తనూ నవ్వింది రూప.


★ ★ ★

ఏమిటీ! ఇది ఇల్లా ఓల్డేజ్ హోమా? డబ్బు యావలో పడి దేశం వదిలిపోయిన వాళ్లందరి అమ్మా అయ్యల్ని కూడా ఇంట్లో పెట్టుకోండి. ఆస్తీపాస్తీ అమ్మి పడేసి వాళ్లకి సేవ చేస్తూ పిల్లలకి చిప్ప చేతికిద్దాం'' నోటికొచ్చినట్టు మాట్లాడుతూ చిందులు తొక్కుతున్నాడు హరి.

ఏది జరగకూడదని ఇంతకాలంగా వెయ్యి దేవుళ్లకి మొక్కుతోందో అదే జరిగేటప్పటికి సిగ్గుతో అవమానంతో కందిపోయింది రూప మొహం. భర్తను ఆపడానికి విశ్వప్రయత్నం చేస్తోంది ఆమె. డైనింగ్ టేబుల్ దగ్గర భోజనం చేస్తున్న పెద్దవాళ్లు ముగ్గురూ నిర్ఘాంతపోయారు. ఈ వారంలో వాళ్లు ఆ ఇంటికి రావడం ఇది మూడోసారి. అసలు గోవర్ధనంగారే వాళ్లని బలవంతపెట్టి పల్లె నుంచి తీసుకొచ్చి ఇల్లు చూసి కాపురం పెట్టించారు. ఈలోగా గిరి చదువు పూర్తికావడం, ఉద్యోగం, పెళ్లి వీటన్నిటి వల్ల వారి ఆత్మీయత మరింత బలపడినట్టయింది. కోడళ్లు కూడా చక్కగా అలిసిపోవడంతో ఎటువైపు నుంచీ అభ్యంతరాల్లేని అపురూపమైంది మా బంధం అనుకున్నారంతా. ఇప్పుడీ ఉరమని పిడుగు దెబ్బకు విలవిలలాడిపోయారు. దూకుడుగా లేవబోతున్న లలితాంబను చేత్తోను, కంచంలోనే చెయ్యి కడగబోతున్న భర్తను కళ్లతోనే వారించింది కుసుమం. జరుగుతున్న అవమానాన్ని ముద్దలుగా మింగి, ఆ రాత్రి పూటే పుట్టెడు దుఃఖంతో తమ ఇంటి దారి పట్టారు దంపతులిద్దరూ. గోవర్ధనం ఫోటో ముందు దిక్కుతోచక కూలబడింది' లలితాంబ. నచ్చజెపుతున్నకొద్దీ రెచ్చిపోతున్న భర్తను ఒంటరిగా వదిలి, పిల్లలను దగ్గరగా తీసుకుని పొడికళ్లతో రాత్రి గడిపింది రూప.

★ ★ ★

''దరమ ప్రెబువు, ఎల్లిపోయారండీ, నేను దగ్గర లేకపోతినే'' గోడు గోడుమని ఏడుస్తున్నాడు ముసలయ్య. పల్లెలో గోవర్ధనంగారి పొలం కౌలుకి తీసుకున్నాడు అతను. అతనికీ ఆ ఇంటికీ ఎన్నో ఏళ్ల అనుబంధం. హరికి ఊహ తెలిసినప్పటి నుంచీ అతన్ని చూస్తూనే



ఉన్నాడు. గోవర్ధనంగారు పోయే సమయానికి అతను ఊర్లో లేడు. రాగానే కబురు తెలిసి పరుగెట్టుకుంటూ వచ్చాడు. అరగంట నుంచీ అలాగే సాగుతోంది అతని ధోరణి. ''నా ఆయువు పోయకపోతివే దేవుడా'' అంటూ మళ్లీ కుమిలిపోతున్నాడు. హరి ఇబ్బందిగా కదిలి తన గదిలోకి వెళ్లిపోయాడు. లలితాంబ కళ్లు తుడుచుకుంటూ అక్కడే కూర్చుంది. ఏడుస్తున్న ముసలయ్య ఏడుపు ఆపి అడిగాడు. ''పిల్లలేరండీ?'' అని.

''స్కూలు వాళ్లు పిక్నిక్‌కి తీసుకువెళ్లారు. రెండ్రోజుల దాకా రారు'' రూప చెప్పింది.

''ఏమిటో వాళ్లు లేకపోయేటప్పటికి ఇల్లంతా మరీ బావురుమంటోంది'' అంది లలితాంబ.

''కాదండీ మరీ, పిల్లలే కదా ఇంటికి సందడి. వాళ్లే లేకపోతే ఏం చూసుకుని బతుకుతావండీ, అందుకే కదా! ఆ అయ్య అంత కొట్టుకుపోయే వారు పిల్లల కోసం! మీరు కూడా ఎంత తాపత్రయం పడ్డారండి? మొక్కని దేవుడున్నాడా? చెయ్యని పూజుందా? ఆ తల్లి కుసుమాంబ చలవ కదండీ, మనిల్లు కళకళలాడ్డానికి? నేనిలా నాలుగు ముద్దలు తినడానికి'' ముసలయ్య చెప్పుకుపోతున్నాడు. అప్రయత్నంగా చెవులు రిక్కించాడు హరి.

''ఎంత ఏడిచేదండీ, హరిబాబునిచ్చినందుకు! దత్తతకు ముందు మూన్నెళ్లు, తర్వాత మూన్నెళ్లు మంచం దిగారేంటండీ? సాంబంగారేమీ పైకి రానివ్వలేదు గానీ'' దీర్ఘంగా నిట్టూరుస్తూ ఆగాడు ముసలయ్య.

''చెట్టుకు కాయ బరువా ముసలయ్యా? అందరికీ పెట్టినట్టు పచ్చడి మెతుకులు పెట్టి పెంచలేనా? ఒక్కడైనా పరమాన్నం తింటాడని ఇవ్వలేదనయ్యా, మా బావ మంచితనం చూసి ఇచ్చాను. మా అక్క, బావ చల్లగా ఉంటే పదిమంది వాళ్ల నీడన సుఖపడతారు అనేదండీ ఆయమ్మ!'' ఆనాటి సంగతులన్నీ కళ్లకి కట్టినట్టు చెపుతున్నాడు ముసలయ్య.

''అయినకాడికి అమ్ముకుని, పట్నం పోయి ఇంట దాని జబ్బు నయం చేద్దామనుకుంటే ఆపారండీ దరమ ప్రెబువు! అసలు ధరకి రెట్టింపు ఇచ్చి నీ పొలం నువ్వే చేసుకో ముసలయ్యా, నీకు

వీలుగా ఉన్నప్పుడే తోచినంత మగతా ఇయ్యి. ఈ పొలం వంకన హరిబాబుని తీసుకొచ్చి కుసుమానికి చూపించొచ్చు. నలుగురి మధ్యన పుట్టిన వాడిని ఒంటిగా పెంచితే దేవుడు మెచ్చుడు అనే వోరండీ!'' చెంపన ఛెళ్లున కొట్టినట్టయింది హరికి.

''అవును! ఇంట్లో మిగిలిన అన్నం పేదవాడికి పెట్టడానికి ఏడుస్తాం. మనం పెట్టినా వాడికి ఒక పూట నిండుతుంది కడుపు. పేగు తెంచుకుపుట్టిన బిడ్డనివ్వడానికి ఎంత పెద్ద మనసుండాలి? ఒక రోజు, రెండ్రోజులు కాదు జీవితాంతం మా మనసులు నింపింది దొడ్డ ఇల్లాలు'' నిట్టూర్చింది లలితాంబ.

''ఏమిచ్చినా తీసుకునేది కాదు. పిల్లవాడినిచ్చినందుకు తీసుకుంటోంది అనుకుంటామనో ఏమో! అంతకు ముందే నయం. అక్కా! ఈ చీర బావుండదనీ అని చనువుగా తీసుకునేది. హరినిచ్చాక మహా అభిమానపడేది'' అంది.

''అవునండి! పిల్లలిద్దరికీ ఒక్కలాంటి బట్టలెయ్యాలని ఉబలాటపడేవారండి. రాముడు-భీముడు, గంగ-మంగ లాంటి సినిమాలు చూసి వారం దాకా కంట తడి పెడతా ఉండేవారండీ'' కల్లాకపటం లేని వాళ్ల సంభాషణ సాగుతూనే ఉంది. మళ్లీ గోవర్ధనం గారి మీదకి మళ్లింది.

''కంటికి రెప్పలా సాకేవారు కదండీ హరిబాబుని గోవర్ధనం బాబు! ఎందుకు హరిబాబు అక్కలతో తమ్ముడితో కలవడం లేదేమో ముసలయ్యా అని అనుమానపడేవారు. రామలక్ష్మణులని విడదీశానా అని మదనపడేవోరు'' తన మనసులోని చీకటిని తొలగించే చండప్రచండమైన కాంతిని భరించలేనట్టుగా కళ్లు మూసుకున్నాడు హరి. ''ఆయనదంతా అతి మంచితనం, చాదస్తం, అంతులేని ప్రేమానూ'' ముచ్చటగా ముక్తాయింపు ఇచ్చింది లలితాంబ. పాతవీ, కొత్తవీ కబుర్లు చెప్పుకున్నాక బరువుగా కదిలాడు ముసలయ్య.

★ ★ ★

ముసలయ్య వెళ్లిపోయాక అత్తగారికి భోజనం పెట్టి ఆకలి లేదన్న హరికి వేడిపాలు తాగించింది రూప. ''అలా వెన్నెల్లో కూర్చుందాం'' అంటూ బాల్కనీలోకి తీసుకెళ్లింది. పెంకిపిల్లవాడికి అడిగిన తాయిలం ఇస్తే నెమ్మదించిన వాడిలా హరి ఆమె చెప్పినట్టు విన్నాడు. పిల్లల ముద్దుముచ్చట్లు చెపుతూ నవ్విస్తోంది రూప. ఏ తండ్రికయినా అంతకంటే నచ్చిన టాపిక్ ఏముంటుంది? హఠాత్తుగా అంది రూప. ''పిల్లలు పిక్నిక్‌కి వెళితేనే ఇంత ఇదవుతున్నాం మనం చిన్నత్తయ్యగారు ఎంత మిస్సయి ఉండేవారో మిమ్మల్ని'' కుసుమాన్ని ఆమె చిన్నత్త అనే పిలుస్తుంది. హరి రియాక్షన్ కోసం చూడక కొనసాగించింది. ''ఆవిడ గట్టిగా బాధపడడానికి కూడా లేదు, ఇచ్చింది తన తరపు వారికయ్యే! ఎంత పేదవాడైనా తను తాగే గంజినీళ్లు పోసి పెంచాలనుకుంటాడు పిల్లల్ని మనకున్నది అమ్మాయి, అబ్బాయి అయినా వారి పెంపకంలో వీసమెత్తు తేడా రావడానికి మన మనసొప్పదు. అంతెందుకు? అత్తగారు వారితో ఎక్కువ సేపు గడిపితేనే అసూయగా అనిపిస్తుంది నాకు. అలాంటిది ప్రాణం మీదకి తెచ్చుకుని కన్న కవలల్లో ఒకరినివ్వాలంటే ఆమె ఎంత త్యాగానికి సిద్ధపడిందో! తన పిల్లవాడి భవిష్యత్తు ఒక్కటే దృష్టిలో పెట్టుకోలేదు. తాను చేసే పని వల్ల పది మందికి మేలు కలుగుతుంది అనుకుంది. మీరు కుసుమాంబ కొడుకుగా ఉంటే ఆ కుటుంబమే మరి కాస్త బాగుపడేది. ఇపుడు మీరు ఎంతమందికి అన్నం పెడుతున్నారు? నేను, నా కుటుంబం అని గిరి గీసుకుని బతికే మనలాంటి వాళ్లకి ఆవిడ పనిలో అంతరార్థం ఏం కనిపిస్తుంది? మన దృష్టి దోషం వల్ల అంతా స్వార్థం కనిపిస్తుంది గానీ! పది మంది పిల్లలున్న తల్లయినా తన దగ్గర లేనివాడి కోసం తహతహలాడుతుంది.

## మారిందయ్యా లుక్!

**సినిమా, సినిమాకీ తారల లుక్స్ మారిపోతుంటాయి. కామెడీ చిత్రం కోసం సునీల్‌షెట్టి తన లైఫ్‌స్టయిల్‌ని, లుక్‌ని మార్చేసుకున్నాడు. 'కొన్ని చిత్రాల కోసం ఆమాత్రం చేయకపోతే ఎలా? అందుకే నా హెయిర్‌స్టయిల్, డ్రెస్ స్టయిల్ అంతా మారిపోయింది. ఇలాగే నేను బాగున్నాను అంటున్నారంతా. ఫార్టీ ప్లస్‌గా ఉన్నా యాక్టివ్‌గా ఉండాలంటే ఇలాంటి మార్పులు తప్పనిసరి' అంటున్నాడు సునీల్. లుక్ మారినట్టే ఈ చిత్రం కూడా తన ఫేట్‌ని మారుస్తుందేమో చూడాలి మరి!**



దూరాన్నించే తన అనురాగమనే 'అమృత వర్షిణి'ని కురిపిస్తుంది. పెంచిన ప్రేమ గొప్పది అన్నారు. కన్న ప్రేమ తక్కువని ఎవరూ అనలేదే, అలా మీకు రెండు ప్రేమలందించిన అమృతమూర్తులు వారు. వారిని నెత్తిన పెట్టుకోవలసింది పోయి కాలదన్నుకుంటున్నాం'' మృదుభాషి అయిన రూప నెమ్మదిగా స్థిరంగా చెబుతోంది. కాదు..కాదు మెత్తటి చెప్పుతో కొడుతోంది అనుకున్నాడు హరి. కానీ చిత్రంగా అతనికి కోపం రావడం లేదు కన్నీళ్లు వస్తున్నాయి. నెమ్మదిగా లేచాడు. తండ్రి ఫోటో ముందు దిగాలుగా కూర్చున్న తల్లి ముందు సాష్టాంగ పడ్డాడు.

''నన్ను మన్నించమ్మా!'' అన్నాడు ''ఇప్పుడే అమ్మానాన్నల్ని తీసుకొస్తాను'' కారు తాళం తీసుకుని.

''ఇంత రాత్రి వేళా?'' అని వారిస్తున్న భార్యని, తల్లిని పట్టించుకోకుండా ఎంత ఆలస్యమయినా విషంగా మారని, మారలేని అమృతవర్షిణిలో తడిసి పునీతమవ్వడానికి ముందుకి కదిలాడు.